# వివిధ దేశాలలో కార్మికుల ఆందోళనలు

**మయన్మార్ దుస్తుల రంగంలోని కార్మికుల దురవస్థ**

ఫిబ్రవరి 2021లో జరిగిన సైనిక తిరుగుబాటు అనంతర కాలంలో మయన్మార్‌లోని దుస్తుల పరిశ్రమలో పనిచేసే కార్మికుల పని పరిస్థితులు నానాటికి దుర్భరమవుతున్నాయి. మయన్మార్‌లో ప్రపంచంలోని అతిపెద్ద బ్రాండ్ కంపెనీలైన హెచ్&ఎమ్ జారా, ఇండిటెక్స్, ప్రిమార్క్, మార్క్స్ & స్పెన్సర్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన బ్రాండ్ కంపెనీల దుస్తులు ఈ దేశంలో తయారు చేయబడతాయి.

మానవహక్కుల వనరుల కేంద్రం అనే ప్రభుత్వేతర సంస్థ ప్రకారం మయన్మార్‌లోని 124 దుస్తుల మిల్లులలో కార్మికుల పని పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. కార్మికుల వేతనాలలో కోతబెట్టడం, కార్మికుల వేతనాల నుండి జరిమానాల రూపంలో కోతలు బెట్టడం, అక్రమంగా ఉద్యోగాల నుండి తొలగించటం, బలవంతంగా ఓవర్‌టైం పని చేయించటం లాంటి రూపాలలో దుస్తుల రంగ కార్మికులు వేధింపబడుతున్నారు.

ఈ పరిస్థితులను నిరసిస్తూ జారా ఫ్యాక్టరీ కార్మికులు సమ్మె చేయనిర్ణయించారు. దానితో జారా కంపెనీ, దక్షిణ ఆసియా దేశాలనుండి తన బ్రాండ్ దుస్తులు ఉత్పత్తి చేయించుకోవటాన్ని విరమించటానికి నిర్ణయించుకొంది.

హెచ్ & ఎం కంపెనీ, కార్మికులపై జరుగుతున్న వేధింపులు, అక్రమ పనిపరిస్థితులపై దర్యాప్తుకు పూనుకొంది. అదేవిధంగా అనేక బ్రాండ్ కంపెనీలు, యీ విషయమై దర్యాప్తులు సాగించటానికి, కార్మికుల పని పరిస్థితులను చక్కబరచటానికీ పూనుకొంటున్నాయి.

**కృత్రిమ మేధోసాంకేతికత ప్రమాదం పట్ల భయపడుతున్న అమెరికా**

అమెరికాలో కృత్రిమ మేధకు చెందిన ఛాట్ జిపిటి విడుదల కావటంతో, అత్యంత నైపుణ్యం గల ఉద్యోగులు కూడా, తమ ఉద్యోగాలు ఆటోమేషన్‌కు గురవుతాయని భయపడుతున్నారు. అమెరికాలోని కార్మికులలో 22% రాబోయే రెండు, మూడు సంవత్సరాల్లో యీ కృత్రిమ మేధ సాంకేతికత వలన తమ ఉద్యోగాలకు హాని జరుగుతుందని భయపడుతున్నారు. గాలప్ అనే సంస్థ నిర్వహించిన సర్వేప్రకారం, యీ సాంకేతికత వల్ల 72% మంది ఉద్యోగుల వేతనాలు, పనిగంటలు, యితర సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతుందని భావిస్తున్నారు. లేబరేటరీలలో ఎక్కువ సంఖ్యలో పనిచేసే మహిళా ఉద్యోగుల ఉద్యోగాలపై యీ కృత్రిమ మేధో సాంకేతికత ప్రభావం ఎక్కువగా వుంటుందని భయపడుతున్నారు.

ఇదిలావుండగా అమెరికాలోని అమెజాన్, ఆల్ఫాబెట్, ఎం.ఎస్, మెటా కంపెనీలలో 'అదృశ్య కార్మికులుగా' తెరచాటున పనిచేసే అనేకమంది సాంకేతికరంగ కార్మికుల పనిపరిస్థితులపై అమెరికా ప్రభుత్వం దర్యాప్తు జరుపుతోంది.

'అదృశ్య కార్మికులు'గా పిలవబడే లక్షలమంది డేటా కార్మికులు, ప్రపంచమంతటా ఒత్తిడిలో, నిరంతర నిఘా క్రింద పనిచేస్తున్నారు. వారు ఎటువంటి శిక్షణ లేకుండా, ఎటువంటి పర్యవేక్షణ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరికి అతి తక్కువ వేతనాలు యిచ్చి, ఎటువంటి సదుపాయాలు యివ్వకుండా కంపెనీలు పనిచేయించుకొంటున్నాయి.

కృత్రిమ మేధస్సుపై కేంద్రీకరించిన కేంద్రాలూ, కంపెనీలూ తమకు పనిచేసే కార్మికులను సబ్-కాంట్రాక్టర్ల ద్వారా నియమించు కొంటున్నాయి. వీరు కంపెనీ వున్న దేశంలో వుండి పనిచేస్తారు. లేదా విదేశాలలో వుండి కూడా పనిచేస్తారు. కంపెనీలు వీరిని ఉత్పత్తుల నాణ్యత లేదా ఉత్పత్తి యొక్క సారాంశాన్ని నాణ్యతలో నిలబెట్టే పనులలో ఉపయోగించుకొంటాయి.

ఈ కార్మికుల సమర్థత గురించీ, వారికి యిచ్చే విశ్రాంతి సమయాల గురించి, వారి మానసిక ఆరోగ్య పరిస్థితిని సంరక్షించే ఏర్పాట్ల గురించీ, వారి పనిభద్రత ఏర్పాట్ల గురించే అమెరికన్ ప్రభుత్వం యిప్పుడు విచారణ జరుపుతోంది. ఇప్పటికే కృత్రిమ మేధస్సు ప్రమాదం నుండి తమను తాము పరిరక్షించుకొనేందుకు హాలీవుడ్ రచయితలు, కళాకారులూ సమ్మె జరుపుతున్న నేపథ్యంలో యీ కృత్రిమ మేధో సాంకేతికత నుండి ఎదురయ్యే ప్రమాదాన్ని ఎదుర్కోవటానికి కార్మికులూ, ఉద్యోగులూ సంసిద్ధపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**తమ పనిగంటలు, తదితర డిమాండ్ల సాధన కోసం ఆటోరంగ కార్మికుల సమ్మె**

1,50,000 మంది సభ్యులుగల యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారానికి 4 రోజులలో, 32 గంటల పనీ, వేతనాల- సదుపాయాల పెంపుదల తదితర డిమాండ్ల సాధన కోసం, ఏకకాలంలో అమెరికాలోని డెట్రాయిట్‌కు చెందిన మూడు పెద్ద కంపెనీలు సెప్టెంబరు 16 నుండి సమ్మె చేశాయి.

ఫోర్డ్ కంపెనీ యొక్క మిచిగావ్‌లోని వెయిన్‌లో గల బ్రాంకో అసెంబ్లీ ప్లాంటులోనూ, మిసిసిపీలోని వెంట్స్‌విలీలో గల జనరల్ మోటార్సు యొక్క పిక్-అప్ ట్రక్కు అసెంబ్లీ ప్లాంటు లోనూ, ఓహియోలోని టొలెడోలోగల క్రిజ్లర్ మాతృసంస్థ అయిన స్టెల్లాంటీ యొక్క జీప్ అసెంబ్లీ ప్లాంటులోనూ ఒకే సమయంలో సమ్మె మొదలైంది.

అమెరికా దేశపు ఆటో పరిశ్రమలో ఒకే సమయంలో మూడు కంపెనీలలో, ఒకే యూనియన్ నాయకత్వాన సమ్మె జరగటం అన్నది చాలా అరుదుగా సంభవించే విషయం. ఈ సమ్మె ప్రభావం అమెరికా దేశపు ఆటో పరిశ్రమ రంగంలో పనిచేసే 10 లక్షలమందిపై పడుతుందని అమెరికా బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ సంస్థ తెలియజేస్తోంది.